క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాగారం : బిక్కేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగారం మండలంలోని పేరబోయినగూడెం సమీపంలోని బిక్కేరువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను నాగారంబంగ్లా శివారులో పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గౌడ సంఘం ఉపాధ్యక్షుడిగా పులుసు వెంకన్న



నాగారం : తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని పస్తాల గ్రామానికి చెందిన పులుసు వెంకన్నగౌడ్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షుడు పులుసు వెంకన్నగౌడ్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ సదానందం నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం వెంకన్నగౌడ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన గౌడ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్, వెంకన్నగౌడ్, కృష్ణమూర్తిగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రచారం 19కి వాయిదా

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ ఎన్నికల ప్రచారం ఈ నెల 18న అర్వపల్లిలో ప్రారంభం కావాల్సి ఉండగా మరుసటి రోజు 19వ తేదీకి మారిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో పూజలు జరిపిన అనంతరం, అర్వపల్లి వైజంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. జంక్షన్‌లో భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు శాలిగౌరారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ, ఎన్నికల ప్రచారం ఉంటుందని చెప్పారు. అర్వపల్లిలో జరిగే ఎన్నికల ప్రచారానికి పార్టీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

'మాదిగలను మభ్యపెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి'

ఆత్మకూర్ (ఎస్) : రాష్ట్రంలో మాదిగలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ముల్కలపెల్లి రవిమాదిగ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు దక్కాల్సిన 3 పార్లమెంటు స్థానాలు, కంటోన్మెంట్ స్థానం దక్కకుండా రేవంత్‌రెడ్డి అవమానించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నవిలె వెంకన్న, తిప్పర్తి గంగరాజు, పల్లెల రాములు, చిన్ని, మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అనంతగిరి : సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అనంతగిరి ఎస్‌ఐ ఎం.నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం అనంతగిరి మండలంలోని శాంతినగర్‌లో సైబర్ నేరాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు సెల్‌ఫోన్‌లకు పంపే లింక్‌లను ఓపెన్ చేయవద్దని, తెలియని లింక్స్ ఓపెన్ చేస్తే బ్యాంక్ ఖాతాలోని నగదును కేటుగాళ్లు ఖాళీ చేస్తారని అన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయిన వారు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన అగ్ని ప్రమాదం

నడిగూడెం : మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న కంప చెట్లకు మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో మంటలు ఎగసిపడి కాలనీలోని ఇళ్ల వైపు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సకాలంలో వచ్చి ప్రమాదం జరగకుండా మంటలను ఆర్పారు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అపరిశుభ్ర పరిసరాలు.. ప్రజల పాట్లు

- కంపచెట్లు, మురుగు గుంతలకు నిలయాలుగా ఖాళీ స్థలాలు
- దోమలు వ్యాప్తి చెందుతుండడంతో ఆందోళన చెందుతున్న ప్రజలు
- ఫాగింగ్ చేయించాలని అధికారులకు వేడుకోలు



సీతారాంపురంలో రోడ్డు వెంట ఉన్న ఖాళీ స్థలంలో పెరుగుతున్న పిచ్చిచెట్లు

అర్వపల్లి : గ్రామాల్లో ఉన్న ఖాళీ స్థలాలు కంపచెట్లు, మురుగు గుంతలకు నిలయాలుగా మారుతున్నాయి. దీనికి తోడు ఈ ఖాళీ స్థలాల్లోనే చెత్త పోస్తుండటంతో పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో పెరుగుతున్న పిచ్చి, కంపచెట్లు చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. ఈ స్థలాలు విషసర్పాలకు నిలయాలుగా మారుతున్నాయి. రాత్రి వేళల్లో విషసర్పాలు ఇళ్లలోకి వస్తుండడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే ఇళ్ల మధ్య గుంతలలో మురుగునీరు చేరి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

ఫాగింగ్ ఎక్కడ..

గ్రామాల్లో దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని 17గ్రామ పంచాయతీలతోపాటు వాటి ఆవాస గ్రామాలు, తండాలలో దోమల సమస్య తీవ్రమైంది. రేయింబవళ్లు దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. దోమల సమస్య రోజురోజుకూ తీవ్ర మవుతుందని, ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని ప్రజలు వాపోతున్నారు. కాగా దోమల నివారణ కోసం నెలకోసారి ఫాగింగ్ చేయాల్సి ఉండగా దాని గురించే అధికారులు మర్చిపోయారు. అన్ని గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ దోమల మందు పిచికారీ చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ ప్రత్యేక అధికారులు అన్ని గ్రామాల్లో ఖాళీ స్థలాల నందు ఉన్న కంపచెట్లను తొలగించాలని, మురుగు గుంతలను పూడ్చించాలని, దోమల మందు పిచికారీ చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు



గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు మొలుస్తున్నాయి. గుంతలలో మురుగు నీరు చేరి పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతోంది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– మచ్చ నర్సయ్య, సామాజిక కార్యకర్త

దోమల మందు పిచికారీ చేయాలి



అర్వపల్లిలో కొన్నేళ్లుగా దోమల మందు పిచికారీ చేయడం లేదు. దీంతో మురుగు కాలువలు, వీధులు దోమలకు నిలయాలుగా మారాయి. సాయంత్రమైతే దోమల మోతతో ఇంటినుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. వెంటనే దోమల మందు ఫాగింగ్ చేయాలి.

– నల్లగుంట్ల శ్రీనివాస్, అర్వపల్లి



అర్వపల్లిలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో..



సీతారాంపురంలో ఇళ్ల మధ్య మురుగు గుంత



తిమ్మాపురంలో పశువైద్యశాల సమీపంలో..

ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టొద్దు



రోడ్లు, భవనాల శాఖ ఇంజనీరింగ్ చీఫ్ గణపతి రెడ్డితో మాట్లాడుతున్న స్థానికులు

తిరుమలగిరి : తిరుమలగిరి తెలంగాణ చౌరస్తాలో మోత్కూరు, తొర్రూరు రోడ్డుపై ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్ట వద్దని స్థానిక వ్యాపారులు, ఇళ్ల యజమానులు రోడ్లు, భవనాల శాఖ ఇంజనీరింగ్ చీఫ్ గణపతిరెడ్డికి విన్నవించారు. మంగళవారం రోడ్లు, భవనాల శాఖ అధికారులు తిరుమలగిరి చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణంపై స్థానికుల అభిప్రాయాలను సేకరించారు. ఇటీవల తిరుమలగిరి పట్టణానికి చెందిన 500 మంది వ్యాపారులు, ఇళ్ల యజమానులు ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టవద్దని స్థానిక శాసన సభ్యుడు మందుల సామేల్‌కు వినతి పత్రం అందజేయగా.. ఎమ్మెల్యే ఈ విషయాన్ని ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థానికుల అభిప్రాయ సేకరణకు అధికారులు మంగళవారం తిరుమలగిరికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడం వల్ల తమ వ్యాపారాలు పూర్తిగా దెబ్బ తింటాయని, వ్యాపారాలు లేక కుటుంబాలన్నీ ఆర్థికంగా చితికిపోతాయని వాపోయారు. స్థానికంగా ఉండే ఇళ్ల యజమానులం అందరం కలిసి రోడ్డుకు ఇరువైపులా సెట్ బ్యాక్ అవుతామని, ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టవద్దని తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు మాట్లాడారు. ప్రజల అభిప్రాయాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోహన్, ఈఈ సుదర్శన్‌రెడ్డి, డీఈ రవీందర్ పాల్గొన్నారు.

ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



రామన్నగూడెంలోని కొనుగోలు కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ చరణ్

అర్వపల్లి : ఉపాధి కూలీలు, హమాలీలు ఎండలలో పనిచేయవద్దని, ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని అర్వపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎల్. చరణ్ కోరారు. రామన్నగూడెం సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీలు, రైతులకు వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల తర్వాత పనులు చేసుకోవాలని సూచించారు. ఎండల దృష్ట్యా ఎక్కువగా మంచినీళ్లు, మజ్జిగ, నిమ్మ రసం, కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలు తాగాలన్నారు. కాటన్ దుస్తులు ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేందర్‌రావు, ఎంపీహెచ్‌ఏలు ఎం.గిరిజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ




ఉపాధి కూలీలకు పని ప్రదేశంలోనే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఏఎన్‌ఎం నాగరాణి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం ఉయ్యాలవాడలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం కూలీలకు వైద్య సిబ్బంది ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాసర్లపహాడ్ పల్లెదవాఖాన ఏఎన్‌ఎం తప్పెట్ల నాగరాణి మాట్లాడారు. ఉపాధి కూలీలు ప్రతిరోజు ఉదయం 10 గంటలలోపే పనులు ముగించాలని సూచించారు. ఎండలలో ఉపాధి పనులకు వెళ్లి వడదెబ్బకు గురికావద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త ఎస్.నాగమ్మ, ఉపాధి కూలీలు గుండె ఈశ్వర్, బొల్లం వెంకన్న, పిట్టల నర్సయ్య, పిట్టల వినోద్, మిర్యాల సైదులు, బొడ్డు సుధాకర్, ఎస్.కిష్టయ్య, పాశం సంజీవరెడ్డి, ముక్కాల వెంకన్న, ముక్కాల రేణుక, పిట్టల స్వప్న, నారబోయిన కొమరమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఆలయాల ముస్తాబు



అర్వపల్లి : విద్యుత్ లైట్ల కాంతుల్లో లోయపల్లిలోని రామాలయం



సూర్యాపేటలోని వేదాంత మందిరంలో విద్యుత్ కాంతుల్లో విగ్రహాలు



తిమ్మాపురంలోని సూర్యక్షేత్రం..

భానుపురి : శ్రీరామనవమికి సూర్యాపేట జిల్లాకేంద్రంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. ప్రధానంగా బొడ్రాయిబజారులోని వేదాంత భజనమందిరంలో ఏటా శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ యేడు శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. బొడ్రాయి చౌరస్తాలో ప్రత్యేక మండపాన్ని నిర్మించారు. వందలాది మంది ఈ కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టెంట్లు, కుర్చీలు, ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. అలాగే పట్టణంలోని పలు చౌరస్తాలు, సంతోషిమాత దేవాలయంతోపాటు పలు దేవాలయాల్లోనూ శ్రీరామనవమికి ఆలయాలను ముస్తాబు చేశారు.

అర్వపల్లి : సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. తిమ్మాపురంలోని సూర్యనారాయణ స్వామి క్షేత్ర ఆవరణలో ఉన్న రామాలయం, అర్వపల్లి, జాజిరెడ్డిగూడెంలలోని యోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాలు, కుంచమర్తి, కొమ్మాల, కోడూరు, లోయపల్లి, కాసర్లపహాడ్ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించడానికి ఆయా గ్రామాల ప్రజలు, నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొన్ని గ్రామాల్లో కల్యాణ తంతు నిర్వహించడానికి ప్రత్యేకంగా పందిర్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. సీతారాముల కల్యాణ వేడుకల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు.



సూర్యాపేటలోని వేదాంత భజన మందిరంలో సిద్ధం చేసిన మండపం



జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో..

జహంగీర్‌కు అత్యధిక మెజార్టీ అందించాలి



మద్దిరాల : మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

మద్దిరాల : భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో నిత్యావసరాల ధరలు పెరిగి పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం సీపీఎం పార్లమెంట్ అభ్యర్థికి చెందిన ప్రచార కరపత్రాలను ఆమె కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట ఏకలక్ష్మి, గోపి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, పాల్వాయి కవిత, పోలోజు సైదులు, నారాయణ, మల్లారెడ్డి, రంగయ్య, వెంకన్న, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి

తుంగతుర్తి : భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. మంగళవారం రావులపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. నిరంతరం నిజాయితీగా ప్రజల పక్షాన పోరాడుతున్న జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుర్ర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యుడు దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన




చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్ ఐకేపీ కేంద్రంలో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీపీఎం

చివ్వెంల : రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూర్యాపేట డీఆర్‌డీఓ డీపీఎం ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్‌లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెంటర్లలో మౌలిక వసతి సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, సీసీ వెంకన్న, సంఘ బంధం అధ్యక్షురాలు పద్మ, వీబీకే మల్లీశ్వరి పాల్గొన్నారు.


17 శాతం వరకు తేమ ఉంటేనే మద్దతు ధర

అర్వపల్లి : రైతులు ధాన్యంలో 17 శాతం వరకు తేమ ఉండేలా చూసుకొని కేంద్రాలకు తేవాలని, అలా అయితేనే ప్రభుత్వ మద్దతు ధర దక్కుతుందని మండల వ్యవసాయ అధికారి రావి శశిధర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం కొమ్మాల, కోడూరు, సూర్యానాయక్‌తండా, లోయపల్లి, అర్వపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శోభారాణి, నేరెళ్ల సత్యం, సెర్ప్ కేంద్రాల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ అమీన్ సింగ్ అన్నారు. మంగళవారం మద్దిరాల మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున్న 17శాతంలోపు తేమ ఉన్న ధాన్యానికి కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వికాస్ పాటిల్, ఏఈఓ భవ్యశ్రీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : లోయపల్లిలో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



మద్దిరాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల కవాతు

మోతె : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మోతె మండలంలోని హుస్సేన్‌బాద్, బుర్కచర్ల, సర్వారం, తుమ్మలపల్లి గ్రామాల్లో మంగళవారం మునగాల సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీఐఎస్‌ఎఫ్ పోలీసు బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతల పరిరక్షణకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగారం : ఎద్దు పొడవడంతో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన నాగారం మండలం వర్ధమానుకోటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధమానుకోట గ్రామానికి చెందిన యానాల నర్సిరెడ్డి(52) ఈ నెల 10వ తేదీన గడ్డి మోపు తీసుకొని వస్తుండగా అదే సమయంలో ఎద్దు వెనుక నుంచి వచ్చి పొడిచింది. దీంతో నర్సిరెడ్డి మెడకు తీవ్ర గాయమైంది. అతడిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి. వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన

మోతె : మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్‌పై మంగళవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి.. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటబొమ్మలు, ఆట వస్తువులను సమకూర్చి వాటిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మోతె, నామవరం అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చిలుకూరు : ఎన్నికల కోడ్ నేపథ్యంలో చిలుకూరు మండల కేంద్రంలో పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాంబాబు మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకెళితే సీజ్ చేస్తామని అన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : మండల పరిధిలోని వేల్పుచర్ల గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 120 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్, వీఎల్‌ఓ కేఎస్‌ఎస్.పద్మ, గోపాలమిత్రలు ఆల్దాస్ లింగయ్య, సూరారపు అర్జున్, కుంభం సురేందర్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాన్ని జయప్రదం చేయాలి



నాగారంలో మాట్లాడుతున్న నాయకులు

నాగారం : భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ ఈ నెల 19న జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో ప్రారంభించే బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారాన్ని జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ నాగారం మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు. మంగళవారం నాగారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, చిల్లర చంద్రమౌళి, దోమల బాలమల్లు, ఈరేటి అంజయ్య, కూరం వెంకన్న, ఈదుల కిరణ్, తరాల అంజి, కన్నెబోయిన మల్లేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లేష్‌ను గెలిపించాలి

తుంగతుర్తి : భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌యాదవ్‌కు మద్దతుగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. మంగళవారం మండల పరిధిలోని రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండాలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ వెంకన్న, వీరన్న, గోపాల్, హేమ, హరిశ్చంద్ర, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అర్వపల్లి : హోమంలో పాల్గొన్న భక్తులు



దోసపహాడ్‌లో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలపరిధిలోని కొమ్మాల గ్రామంలో గతేడాది పునర్నిర్మించిన భక్తాంజనేయస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి హోమం జరిపారు. అలాగే ఆంజనేయస్వామి విగ్రహానికి సింధూరం ఎక్కించారు. కార్యక్రమం అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గోళ్ల రమేష్-మమత, గోళ్ల వెంకటేశ్వర్లు-జ్యోతి, గోళ్ల సోమయ్య-విజయ దంపతులు, కొడగాని ధర్మాజీ, బాషపోలు శ్రీను, బచ్చాటి ప్రవీణ్, కుదురుపాక ఉదయ్, శిగ రంజిత్, ఆకుల సైదులు, దూదిగామ సంపత్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మూడో వార్షికోత్సవాలు

పెన్‌పహాడ్ : దోసపహాడ్ గ్రామంలో శ్రీసీతారామాంజనేయ దేవాలయ మూడవ వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ దొంగరి జానకిరామయ్య ఆధ్వర్యంలో పురోహితులు వెంకటరమణ, సత్యనారాయణ, గిరి శాస్త్రిలు శాస్త్రబద్ధంగా పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, స్వాతి, లంకలపల్లి వెంకటాచారి, చింతల శ్రీరాములు, బోనయ్య, ఉపేందర్, కర్తం గురవయ్య, చైతన్యరాజు, శ్రీకాంత్, సందీప్, కాశయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.